సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



పోచమ్మ బోనాలు

జూలపల్లి: సమ్మక్క– సారలమ్మ జాతర కమిటీ ఆధ్వర్యంలో అబ్బాపూర్‌లో పోచమ్మ బోనాలతో అమ్మవార్లకు పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.



మల్లన్నకు మొక్కులు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.2/17.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

బాధితులకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్‌

మంథని: వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌కు వచ్చేవారికి సత్వర న్యాయం చేయాలని రామగుండం ఏసీపీ రమేశ్‌ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌ పరిసరాలు, రికార్డులు, రిసెప్షన్‌ కౌంటర్‌, స్టేషన్‌ రైటర్‌, లాకప్‌ రూమ్‌లు పరిశీలించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమరాల ఏర్పాటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. సైబర్‌ నేరాలతోపాటు యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. రాబోయే పార్లమెంట్‌ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజుగౌడ్‌, ఎస్సైలు వెంకటకృష్ణ, రాణి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో నైపుణ్య శిక్షణ

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): ఖోఖో క్రీడాకారులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సురేశ్‌ ఆదివారం తెలిపారు. పట్టణానికి మంజూరైన ఖేలో ఇండియా సెంటర్‌(ఖోఖో) ద్వారా ఆసక్తిగల క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక మినీస్టేడియంలో అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల బాల, బాలికలు తమ ఆధార్‌ జిరాక్స్‌తో మొబైల్‌ నంబరు 79950 78488లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జీవో 22 అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో జీవో నంబర్‌ 22 అమలు పరుస్తూ, కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం డైరెక్టర్‌(పా) ఎన్వీకే శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్‌ కార్మికులకు జీవో నంబరు 22 ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జీవో 22ను అమలు చేసి వారి వేతనాలు పెంచుతామని పేర్కొందన్నారు. ఇప్పటికీ ఒప్పందం జరిగి ఏడాది దాటినా అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి గెజిట్‌ విడుదల చేయించి అమలు చేస్తామని చెప్పిన యాజమాన్యం.. ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కాంట్రాక్ట్‌ కార్మికులకు వేతన పెంపు వర్తింపజేయాలని, సొంత ఇంటి పథకం కోసం కాంట్రాక్టు కార్మికులకు రూ.3లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్‌, శనిగల శ్రీనివాస్‌, తొడుపునూరి రమేశ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్‌కు సర్టిఫికెట్‌



సర్టిఫికెట్‌ అందుకుంటున్న జ్యోత్స్న

గోదావరిఖనిటౌన్‌: స్థానిక సాక్రెడ్‌హార్ట్‌ పాఠశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్‌ జ్యోత్స్న నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ (ఎన్‌ఐడీఎం) సర్టిఫికెట్‌ అందుకున్నారు.ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలో ఇటీవల 'చైల్డ్‌ సెంట్రిక్‌ డిజాస్టర్‌ రిస్క్‌ రిడక్షన్‌– సౌత్‌ రీజియన్‌' అంశంపై సదస్సు నిర్వహించారు. సీసీడీఆర్‌ఆర్‌ సెంటర్‌, నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ప్రభుత్వం సంయుక్తంగా జాతీయస్థాయిలో వర్క్‌షాప్‌ నిర్వహించాయి. ఇందులో 'ఆడపిల్లలు మొబైల్‌ ఫోన్‌ వినియోగించడం ప్రమాదకరమైన విపత్తుగా పరిగణించాలి' అంశంపై జ్యోత్స్న శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ కనబర్చినందుకు ఎన్‌ఐడీఎం సౌత్‌ క్యాంపస్‌ డైరెక్టరేట్‌ కల్నల్‌ పీఎస్‌రెడ్డి నుంచి ఆమె సర్టిఫికెట్‌ అందుకున్నారు. ఆమెను పలువురు అభినందించారు.

శిక్షణ.. ఉపాధి.. ఉద్యోగం

- 'టాస్క్‌' సెంటర్‌ ఏర్పాటుకు చర్యలు
- నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ
- స్థల సేకరణలో అధికారులు నిమగ్నం

'విద్యావంతులైన యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు టాస్క్‌(తెలంగాణ అకాడమీ ఆఫ్‌ స్కిల్‌ అండ్‌ నాలెడ్జ్‌) సెంటర్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తాం.. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు దక్కేలా శిక్షణ అందించేందుకు ఐటీ నిపుణులను నియమిస్తాం'

– ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌ బాబు



ఐకేపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌, టాస్క్‌ సీఈవో(ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: జిల్లా కేంద్రంలో టాస్క్‌ సెంటర్‌ ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకు అనుకూలమైన భవనాల అన్వేషణ ప్రక్రియ ఇప్పటికే పూర్తిచేసింది. ఈమేరకు టాస్క్‌ సీఈవో శ్రీకాంత్‌సిన్హాతో కలిసి కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ ఇటీవల పలు ప్రాంతాల్లో అనువైన భవనాలు పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐతో పాటు మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలోని పలు భవనాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు.

మెరుగైన శిక్షణ కోసం..

విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మెరుగైన శిక్షణ ఇప్పించి నైపుణ్యం పెంచేందుకు హైదరాబాద్‌, బెంగళూరు లాంటి నగరాల్లోని బహుళ జాతి సంస్థలను కూడా ఇక్కడ భాగస్వాములను చేసేందుకు టాస్క్‌ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. టాస్క్‌కు ఎంపికైన నిరుద్యోగ యువత సామర్థ్యాన్ని బట్టి సాంకేతిక, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంచేలా శిక్షణ అందించనున్నారు.

శిక్షణ.. కొలువు..

జిల్లాలో ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులకు టాస్క్‌ ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఆలోచనతో పెద్దపల్లిలో టాస్క్‌ సెంటర్‌ ఏర్పాటు చేస్తున్నారు. పీజీ, డిగ్రీ, ఇంటర్‌, డిప్లొమా తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులను పోటీ పరీక్షలకు ఈ సెంటర్‌ ద్వారా సన్నద్ధం చేయనున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు అవసరమైన నైపుణ్యం సాధించేందుకు శిక్షణ పొందే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఈమేరకు జిల్లాస్థాయి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

విద్యార్థులను భాగస్వాములను చేస్తూ..

ఉన్నత విద్య అభ్యసించే కాలేజీ విద్యార్థులు 'టాస్క్‌'లో భాగస్వాములయ్యేలా కసరత్తు చేస్తున్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం పెంపుపై తర్ఫీదు ఇవ్వడమే కాదు.. వారిలో చైతన్యం వచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లిష్‌ భాషపై అవగాహన కల్పించి, వారు ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడేలా శిక్షణ ఇప్పించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రస్తుతం ఉన్నఒత్తిళ్లను తగ్గించి, మానసికోల్లాసం పెంపొందించడం లక్ష్యంగా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

జిల్లాలో నిరుద్యోగుల వివరాలు

విద్యార్హత	సంఖ్య
ఎస్సెస్సీ	5172
ఇంటర్‌	4391
గ్రాడ్యుయేట్లు	5420
టైపిస్టులు	97
బీఎడ్‌	510
ఎస్‌జీటీటీ	52
డిప్లొమా	259
ఐటీఐ	2405
పారామెడికల్‌	159
ఇతరులు	778

వేగవంతంగా జాతర పనులు



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌

గోదావరిఖని: సమ్మక్క – సారలమ్మ జాతర సమీపిస్తున్న తరుణంలో పనులు, ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌ అధికారులకు సూచించారు. జాతర ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సౌకర్యాలను ఆయన ఆదివారం పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట గోదావరిఖని ఏసీపీ రమేశ్‌, సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాదరావు, జాతర కమిటీ చైర్మన్‌ పిస్సింటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్‌, ముస్తాఫా, మారెల్లి రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

జాతర క్యాంపు ప్రారంభం

గోదావరిఖనిటౌన్‌: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల కోసం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతర క్యాంపు, లహరి ఏసీ బస్సులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌, డిపో మేనేజర్‌ ఎం.నాగభూషణంతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌ అ ధికారులు, ఆర్టీసీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మేడారానికి ఉచిత ప్రయాణం

- ఎమ్మెల్యే విజయరమణారావు
- పెద్దపల్లిలో ఆర్టీసీ జాతర బస్సులు ప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్‌: మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం చర్యలు తీసుకుందని, మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరకు కూడా ఉచితంగానే వెళ్లి రావచ్చని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణ నుంచి మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఆదివారం పూజలు చేసి ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్‌ ఇరుకుగా ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్‌, అధికారులతో మాట్లాడి విశాలమైన ఐటీఐ మైదానంలో బస్సులు అందుబాటులో ఉంచామని ఎమ్మెల్యే తెలిపారు. పెద్దపల్లి నుంచి మేడారం జాతరకు 203 బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపిస్తున్నారని తెలిపారు. డిపో మేనేజర్లు మాధురి, సునీత, స్టేషన్‌ మేనేజర్‌ రాంగోపాల్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్‌, రాములు, నాయకులు ప్రకాశ్‌రావు, మల్లయ్య, సంపత్‌, రాజేందర్‌, శ్రీనివాస్‌, జగదీశ్‌, సునీల్‌, సమ్మిరెడ్డి, శ్రీకాంత్‌, నదీం, రవి పాల్గొన్నారు.

ఆశలన్నీ రిజర్వేషన్‌పైనే..

- ధర్మారం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ రద్దు
- కొత్త కమిటీ నియామకంపై ఆశావహుల్లో ఆందోళన



ధర్మారం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ కార్యాలయం

ధర్మారం(ధర్మపురి): ధర్మారం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 13న ఉత్తర్వులు జారీచేసింది. త్వరలోనే అన్ని వ్యవసాయ మార్కెట్‌ కమిటీలకు పాలవర్గాలను నియమిస్తామని ప్రకటించింది. దీంతో పదేళ్లుగా పదవులు లేకుండా ఉన్న కాంగ్రెస్‌ నాయకులు కుర్చీలపై ఆశలు పెంచుకుంటున్నారు.

తొలుత ఏడాది గడువుతో..

- బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక మార్కెట్‌ కమిటీ పాలకవర్గం కాలపరిమితిని ఒక సంవత్సరంగా ప్రకటించింది.
- అంతేకాకుండా సంబంధిత శాఖ మంత్రి సిఫారసుతో రెండు పర్యాయాలు ఆర్నెల్లపాటు గడువు పొడిగించే అవకాశం కల్పించింది.
- ఈ క్రమంలోనే మార్కెట్‌ కమిటీలకు ఐదేళ్లకో సారి రిజర్వేషన్‌ మారుతుందని ప్రకటించింది.
- ఆ ప్రకారంగా ధర్మారం మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ స్థానం ఈసారి ఎస్టీకి కేటాయించింది.
- ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోంది.
- బీఆర్‌ఎస్‌ సర్కారు ప్రకటించిన రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగిస్తుందా, కొత్త పద్ధతి అమలు చేస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- ఇప్పటికే చైర్మన్‌ పదవి ఎస్టీకి రిజర్వు చేసినట్లు కాంగ్రెస్‌ నాయకుడు ఒకరు వాట్సాప్‌ గ్రూపుల్లో పోస్టు చేయడం వైరల్‌గా మారింది.
- ఆశావహుల్లో అలజడి రేపుతోంది.
- మరోవైపు.. కాంగ్రెస్‌ పార్టీకి చెందిన గిరిజన నాయకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

సామాజిక వర్గాల్లో చర్చ..

ధర్మారం మార్కెట్‌ కమిటీ జనరల్‌ కేటగిరీకి కేటాయిస్తే.. తమకే అవకాశం వస్తుందని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులతోపాటు బీసీ వర్గాల నాయకులూ పోటీపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎస్టీకి కేటాయించారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీంతో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు అయోమయంలో పడ్డారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ మాత్రం మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రిజర్వేషన్‌పై కానీ, చైర్మన్‌ పదవి విషయంలో కానీ, ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి హామీలు ఇవ్వలేదని సమాచారం.

పనిచేయని పోలీసుస్టేషన్‌ ఫోన్‌నంబర్లు

- ఈ ఫోన్‌ నంబర్లు మనుగడలో లేవు
- సమాచారం అందించేందుకు బాధితుల ఇబ్బందులు
- అలంకారప్రాయంగా ల్యాండ్‌లైన్‌, మొబైల్‌ ఫోన్‌ నంబర్లు



రాణా భవనంపై ఏర్పాటు చేసిన ఫోన్‌ నంబర్లు

జ్యోతినగర్‌(రామగుండం): ప్రజలు, బాధితులకు సేవలు అందించేందుకు 24గంటల పాటు అందుబాటులో ఉండాల్సిన ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లోని ల్యాండ్‌లైన్‌, మొబైల్‌ ఫోన్‌నంబర్లు పనిచేయడం లేదు. దీంతో తమ సమస్యలను పోలీసులకు ఎలా తెలియజేయాలో తెలియక బాధితులు, ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బోర్డుకే పరిమితం..

ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ ఎదుట బోర్డుపై రాసి ఉన్న ల్యాండ్‌లైన్‌, మొబైల్‌ ఫోన్‌ నంబర్లు మనుగడలో లేవు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సాధారణ ప్రజలు తమ సమస్యలను ఎవరికి తెలియజేయాలో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం సర్కిల్‌ కార్యాలయానికి సైతం నోటీసు బోర్డు లేదు. అయితే, సర్కిల్‌ కార్యాలయం , ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ రాజీవ్‌ రహదారి పక్కనే ఉండడంతో తరచూ ఏదోఒక ప్రమాదం చోటుచేసుకుంటోంది. అసాంఘిక కార్యకలాపాలూ జరుగుతున్నాయి. ఇలాంటి సమాచారం అందించేందుకు పోలీసుస్టేషన్‌కు సంబంధించిన ఫోన్‌ నంబర్లు బోర్డుపై రాసినా.. అవి పనిచేకపవడంతో విస్మయం వ్యక్తమవుతోంది. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటామన్న పోలీసు వ్యవస్థకు సంబంధించిన ఫోన్‌ నంబర్లు పనిచేయకవడం ఏమిటనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఫోన్‌ నంబర్లు స్టేషన్‌హౌస్‌ ఆఫీసర్ల ఫోన్‌ నంబర్లు బోర్డుపై రాయించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా ఈ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

కనీస పింఛన్‌ రూ.5వేలు చెల్లించాలి

- బీఎంఎస్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేశం



శ్రీనివాస్‌



తూర్పు రాంరెడ్డి

గోదావరిఖని: కార్మికుల కనీస పింఛన్‌ రూ.5వేలు ఉండాలని బీఎంఎస్‌ జాతీయ కార్యదర్శి మల్లేశం పేర్కొన్నారు. రెండురోజుల పాటు ఖనిలో జరిగిన బీఎంఎస్‌ 4వ త్రైవార్షిక రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. బీఎంఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. అసంఘటిత రంగాన్ని బలోపేతం చేయడం లాంటి అంశాలపై బీఎంఎస్‌ పోరాటం చేస్తుందని తెలిపారు. అందుకు కార్యకర్తలు సిద్ధంకావాలని అన్నారు. మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించేందుకు తీర్మానాన్ని ఆమోదించారు. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి రాంమోహన్‌, మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి విష్ణువందన, భూలోకేశ్వరి, జిల్లా అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్మికుల సంక్షేమానికి పలు తీర్మానాలను ఆమోదించారు.

నూతన అధ్యక్షునిగా శ్రీనివాస్‌

బీఎంఎస్‌ రాష్ట్ర నూతన కమిటీని ఈసందర్భంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కల్లాల్‌ శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శిగా తూర్పు రాంరెడ్డి, కార్యదర్శిగా కంది శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు 8మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న రాజ్‌ఠాకూర్‌

గోదావరిఖని: ఆటో బతుకుల షార్ట్‌ఫిల్మ్‌ పోస్టర్‌ను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌ ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక గోదావరి తీరంలోని సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. నటుడు మంద రవికుమార్‌, నాయకుడు మహంకాళి స్వామి, ఏసీపీ రమేశ్‌, సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, ఎస్‌కే చోటు, ప్రతినిధులు మడిపల్లి మల్లేశ్‌, కనుకుంట్ల నారాయణ, బొంతల రాజేశ్‌, కండే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో వాతావరణం

- అందుబాటులోకి 'మౌసం' యాప్‌
- నష్ట నివారణకు ఉపయోగం
- రైతులు, వ్యాపారులకూ ప్రయోజనకరం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



రామగుండంలోని భారత వాతావరణ శాఖ కార్యాలయం

రామగుండం: మారుమూల ప్రాంతాల ప్రజలు వాతావరణ పరిస్థితులు తెలుసుకునేందుకు భారత వాతావరణ శాఖ 'ప్రతీచోట వాతావరణం.. ఇంటింటా వాతావరణం' నినాదంతో ముందుకు సాగుతోంది. తాజా పరిస్థితులు తెలుసుకునేందుకు గత జనవరి 15న 150వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మౌసం' యాప్‌ రూపొందించి 12 భాషల్లో వాతావరణ పరిస్థితులు తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. వాతావరణ అంచనాలు, సూచనలు, మార్పులు, వర్షాలు, ఎండలు, పిడుగులు తదితర సమాచారం మౌసం యాప్‌ ద్వారా ప్రజలకు చేరవేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐఎండీ సేవలు విస్తృతం చేస్తోంది. ఇందులో కృత్రిమ మేధా(ఏఐ)తో నాణ్యమైన సేవలు అందిస్తోంది.

- **పాఠశాలస్థాయి నుంచే అవగాహన..**

విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏడాది పొడవునా ప్రత్యేక ప్రదర్శన, ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

- **మారుమూల గ్రామీణులకు అందుబాటులో..**

'పంచాయతీ రుతుసేవ' పేరిట ప్రతీ గ్రామంలో ఐదుగురు రైతులతో అనుసంధానమై వాతావరణ సేవలు విస్తృతపర్చుతోంది. అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం తదితర వాతావరణ హెచ్చరికల సమాచారం రైతులకు స్పష్టంగా తెలిసేలా చర్యలు తీసుకుంది.

- **సాధారణ యాప్‌ల తరహాలోనే..**

ఆండ్రాయిడ్‌ మొబైల్‌ ఫోన్లలో సాధారణ యాప్‌ల తరహాలోనే ప్లేస్టోర్‌ నుంచి 'మౌసం' యాప్‌ను సులభంగా ఇన్‌స్టాల్‌ చేసుకోవచ్చు. ఇందులో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు, సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, చంద్రాస్తమయం, గాలి, పవనాల స్థితిగతులను సులభంగా తెలుసుకునే వీలుంది. యాప్‌లో వాతావరణ తక్షణ సమాచారం, ఐదు రోజుల వాతావరణ సమాచారం, వాతావరణంలో వచ్చే మార్పులు, చేర్పులు స్పష్టంగా అంచనా వేయవచ్చు. ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లేందుకు టూరిజం వారికి వాతావరణంపై స్పష్టత వచ్చే అవకాశం కూడా ఉంటుంది.

- **ఐఎండీ అందించే సేవలు..**

భారత వాతావరణ శాఖ అందించే 24 శాఖలు వాతావరణ సేవలకు లోబడి సదరు రంగాలు నిర్ణయాలు తీసుకుంటాయి. ముఖ్యంగా రుతుపవనాలు, ఏవియేషన్‌, తుపాన్లు, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, షిప్పింగ్‌, వరదలు, రక్షణ శాఖ, జలశాస్త్రం (హైడ్రాలజీ), రవాణా వ్యవస్థ, తీర్థయాత్రలు, పర్వతారోహణ, పవర్‌–ఎనర్జీ, పర్యాటకం, పొగమంచు, మత్స్యశాఖ, ఆరోగ్యం, క్రీడలు, వాతావరణశాస్త్రం (క్లైమెటాలజీ), పట్టణ అభివృద్ధి, పర్యావరణం, అంతరిక్షం(స్పేస్‌), పరిశ్రమలు, బీమా తదితర విభాగాల పనితీరును వాతావరణశాఖ సూచనలు, సలహాలకు లోబడి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

అవగాహన కల్పిస్తాం



మౌసం యాప్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. ప్రతీ వ్యక్తికి వాతావరణ స్థితిగతులపై అవగాహన అవసరం. తద్వారా రైతులు, ఇతరత్రా వ్యాపారాలు చేసేవారు ముందస్తు వాతావరణ పరిస్థితులు తెలుసుకొని నష్ట నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో ఏఐ పరిజ్ఞానంతో యాప్‌ పనితీరు మరింత మెరుగుపర్చుతారు.

– వెంకట ప్రదీప్‌కుమార్‌, వాతావరణ శాఖ అధికారి, రామగుండం

క్లుప్తంగా

ముత్యంపేట పోచమ్మ ఆలయంలో చోరీ


గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన హుండీ

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట పోచమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీని పగులగొట్టి, భక్తులు హుండీలో వేసిన నగదు, ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని సమాచారం. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ పగులగొట్టి ఉండడాన్ని గమనించి వీడీసీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం


సహాయక చర్యల్లో గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఒకరి ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బద్దం గంగారెడ్డి ఇంట్లో ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గ్రామస్తులు గమనించి నీళ్లు చల్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, పైకప్పు పూర్తిగా కాలిపోయింది. చివరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేసింది. ఘటనలో సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు, అధికారులు పేర్కొన్నారు.

కుక్కలదాడిలో 28 గొర్రెపిల్లల మృతి


గొర్రె పిల్లలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన అత్తెన మల్లేశంకు చెందిన గొర్రెల మందపై ఆదివారం వేకువజామున కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 28 గొర్రెపిల్లలు మృతిచెందాయి. గొర్రెల కాపరి కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమివేశారు. బాధితుడికి ప్రభుత్వం పరిహారం అందించాలని స్థానికులు కోరారు. అలాగే కుక్కల బెడదను అరికట్టాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


పెరుగు శేఖర్(ఫైల్)

మల్యాల(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. మల్యాల మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన పెరుగు శేఖర్ (27) బైక్‌పై జగిత్యాల వెళ్తుండగా.. మద్దుట్ల గ్రామానికి చెందిన వంగల శివ జగిత్యాల నుంచి మద్దుట్లకు వస్తూ శనివారం రాత్రి రాజారం గ్రామం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో శివ కాలు, చేయి విరిగింది. శేఖర్ తలకు తీవ్రంగా గాయం కావడంతో కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ శేఖర్ ఆదివారం మృతిచెందడంతో గొల్లపల్లిలో విషాదం నెలకొంది.

సుల్తానాబాద్‌లో ఖోఖో.. సిరిసిల్లలో కబడ్డీ

- ఉమ్మడి జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్లు మంజూరు
- ఇప్పటికే కరీంనగర్‌లో జూడో సెంటర్
- క్షేత్రస్థాయిలో క్రీడాభివృద్ధికి దోహదం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాభిమానులు



సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌కు మంజూరైన క్రీడాప్రాంగణం

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడల్లో ఇండియాను నంబర్‌వన్‌గా నిలిపేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా జిల్లాకో క్రీడా సెంటర్ మంజూరు చేస్తోంది. గతంలో కరీంనగర్ జిల్లాకు జూడోలో ఖేలో ఇండియా సెంటర్ మంజూరు చేయగా.. తాజా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఖోఖో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు కబడ్డీ సెంటర్‌ను మంజూరు చేసింది. దీంతో ఆయా జిల్లాల్లోని క్రీడలు క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో నైపుణ్యంగల క్రీడాకారులకు సువర్ణ అవకాశం కల్పించినట్లయ్యింది.

ఖోఖో ఖిల్లా.. సుల్తానాబాద్

తెలంగాణలో ఖోఖో ఖిల్లాగా పేరుగాంచిన సుల్తానాబాద్‌లో ఖోఖోక్రీడలో ఖేలో ఇండియా సెంటర్ మంజూరుకావడం విశేషం. ఇక్కడి క్రీడాకారులు 75మందికి పైగా జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్నవారే. పలువురు క్రీడాకారులు జాతీయస్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సైతం సాధించారు. ఇదే ప్రాంతానికి చెందిన గెల్లు మధుకర్ యాదవ్ రెండుసార్లు భారత ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం మంజూరైన ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌కు కోచ్‌గా నియామకమయ్యారు. నేడు సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీలోని తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణంలో సెంటర్ ప్రారంభం కానుంది.

కబడ్డీ కంచుకోటలో

ఉమ్మడి జిల్లాలో కబడ్డీకి కంచుకోటగా పిలిచే నూకలమర్రి, చెక్కపల్లి ప్రాంతాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోనివే. తమ జిల్లాకు కబడ్డీ ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. రెండు ప్రాంతాల నుంచి సుమరు వందల సంఖ్యలో క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తాచాటారు. ప్రస్తుతం మంజూరైన ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్ రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో త్వరలో ప్రారంభం కానుంది. జిల్లాస్థాయిల్లో ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ నిర్ణయించడంపై జిల్లాలోని క్రీడాభిమానులు, క్రీడాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి రోజులు



జిల్లాల్లో ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. క్షేత్రస్థాయిలో క్రీడాభివృద్ధి జరుగుతుంది. క్రీడాకారులుగా ఎదుగాలనే వారికి ఖేలో ఇండియా సెంటర్లు దిక్సూచిగా పనిచేస్తాయి. కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– అజ్మీరా రామదాసు, డీవైఎస్‌వో రాజన్న సిరిసిల్ల

గ్రామీణులకు అవకాశం



జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న ఖేలో ఇండియా సెంటర్లతో గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు లభిస్తాయి. సెంటర్లలో మెరుగైన శిక్షణ లభిస్తుంది. ఉన్నతమైన ప్రమాణాలు, శిక్షకులతో ప్రతీరోజు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. తద్వారా నైపుణ్యంగల క్రీడాకారులుగా ఎదగవచ్చు.

– సురేశ్, డీవైఎస్‌వో పెద్దపల్లి

అద్భుతమైన శిక్షణ ఇస్తా



రెండుసార్లు భారత జట్టుకు ఆడిన. సుమారు 60కి పైగా జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. దీంతో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌లో శిక్షణపొందే క్రీడాకారులకు అద్భుతమైన శిక్షణ అందిస్తా. సుల్తానాబాద్ ఖోఖో చరిత్రకు పూర్వవైభవం తీసుకొస్తా. ఆసక్తి గల క్రీడాకారులు దరఖాస్తులు చేసుకోవాలి.

– గెల్లు మధుకర్ యాదవ్, కోచ్, సుల్తానాబాద్

పూర్వవైభవం



ఖోఖోకు కేరాఫ్ అడ్రస్ సుల్తానాబాద్. అలాంటి సుల్తానాబాద్‌కు ఖేలో ఇండియా సెంటర్ రావడం సంతోషకరమైన విషయం. సుల్తానాబాద్ ఖోఖోకు పూర్వవైభవం రానుంది. సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ పక్షాన అన్ని రకాల సాయం అందిస్తాం. ఖేలో ఇండియా సెంటర్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ముస్త్యాల రవీందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు

బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలకు స్పందన వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశేష ప్రతిభ కనబరిచిన గుర్రాల హరిహర, జి.శివకృష్ణ, కె.రాజు, డి.వర్షిత్ కుమార్, ఈ.లక్ష్మీలీల, గుర్రాల హరిణి, శ్రీ.ఠాకూర్ తేజస్విని, పవన్, ఆర్.బాలరాజ్, ఓ.అక్షయ్ కార్తీక్, పెండం కావ్య శ్రీ,, దామరిచి రచన, వేల్పుల అక్షిత, ఆర్.కల్యాణి, కె.అక్షరను ఈ నెల 21,22 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మురళి, ఎం.శ్రీకాంత్, పృథ్వీరాజ్, గోల్కొండ శ్రీరామ్, కుమార్‌స్వామి, రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు


సెమీఫైనల్‌లో ప్రవేశించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుతో ఏసీపీ ప్రతాప్

- పురుషుల సెమీస్‌లో కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్
- మహిళల సెమీఫైనల్‌లో హైదరాబాద్, వరంగల్ జిల్లాల జట్లు
- నేటితో ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ రేకుర్తిలోని లయోలా కళాశాల ఆవరణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలు చివరిదశకు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో ఆతిథ్య కరీంనగర్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లా జట్లు, మహిళల విభాగంలో హైదరాబాద్, వరంగల్ జిల్లాల జట్లు సెమీఫైనల్‌లో ప్రవేశించాయి. నేడు సెమీఫైనల్, ఫైనల్ పోటీలు జరుగుతాయని, సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లు సత్తాచాటి పతకాలు సాధించాలని ఏసీపీ సి.ప్రతాప్ సూచించారు. ఆదివారం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని రెండోరోజు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అన్నారు. క్రీడా కోటాతో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీకాంత్, తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రాష్ట్ర, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు, పీడీలు, పీఈటీలు బసరవేణి లక్ష్మణ్, ప్రభాకర్, మూల వెంకటేశ్, వేల్పుల సురేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాయల కోసం చెట్టు ఎక్కి..

- చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామానికి చెందిన పీసు రఘునందన్‌రెడ్డి (65) ప్రమాదవశాత్తు ఆదివారం ఉదయం చింతచెట్టు పైనుంచి పడి మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇంటి సమీపంలోని చింతచెట్టుపైకి ఎక్కి చింతకాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి రాళ్లగోడపై పడ్డాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని చొప్పదండి వద్ద మరణించాడు. మృతుడి కుమారుడు దేవేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందతూ వ్యక్తి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన మేకల రవి(35) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య కొన్నిరోజుల నుంచి కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన రవి.. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు మేకల కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


రాజు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓ వ్యక్తి అనారోగ్యంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ సారంపల్లి ప్లాట్స్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంబారీపేటకు చెందిన గుండం రాజు (32) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉపాధి కోసంరెండేళ్లకిత్రం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో 7 నెలలక్రితం తిరిగి వచ్చాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఏపని చేయలేక తనలో తానే మదనపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆది వారం వేకువజామున ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, తండ్రి ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

మల్యాల(చొప్పదండి): అజాగ్రత్తగా, అతివేగంగా కారు నడిపి, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. మల్యాల ఎస్సై కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెందిన గరిగంటి శ్రీనివాస్ జగిత్యాలకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో మల్యాల మండలం ముత్యంపేట శివారులోని టౌన్‌షిప్ సమీపంలో శనివారం గోనె వందన్‌కుమార్ తన కారును అజాగ్రత్తగా.. అతివేగంగా నడిపి, బైక్‌కు ఢీకొనడంతో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

- ఒకరి తీవ్ర.. ఇద్దరికి స్వల్పగాయాలు


అదుపుతప్పి పంటపొలాల సమీపంలో పడిన కారు

సిరిసిల్లక్రైం: ముస్తాబాద్ నుంచి వేములవాడ వైపు సిరిసిల్ల రెండో బైపాస్ మీదుగా వస్తున్న కారు అతివేగంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. అతివేగంతో వస్తున్న కారు పెద్దూరు శివారులోని అపరల్ పార్క్ సమీపంలో అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డు కిందకు దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు అరవడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగ్రాతులను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కాగా, మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట తరలించారు. మరో ఇద్దరికి స్వల్పగాయాలైనాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. కనగర్తి గ్రామానికి చెందిన వేణు వేములవాడలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుద్దాల సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో వేణుకు తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న బీజేపీ

- మతతత్వ విధానాలతోనే పేదరికం
- రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి
- ఉపాధి కార్మికులకు రూ.600 చెల్లించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించిన ఉపాధిహామీ కార్మికుల జిల్లాస్థాయి సదస్సులో మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలు చేయడంతోనే దేశంలో పేదరికం పెరిగిపోతోందన్నారు. కో–ఆపరేటివ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను మోదీ సర్కారు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించి, చనిపోయిన 700 రైతుల కుటుంబాలకు పరిహారం అందివ్వాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో అత్యధికంగా నిధులు కేటాయించాలని, గ్రామాల్లో పనిచేసే కార్మికులకు పనిముట్లు ప్రభుత్వమే అందించి, 15రోజులకు ఒకసారి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో కార్మికునికి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. కార్మికుల, కర్షకుల సంక్షేమం కోసం బీజేపీ విధానాల నువ్యతిరేకిస్తూ పోరాటాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఎంబాల మల్లేశ్, కడారి రాములు, జంగం అంజన్న, అజ్జ వేణు, మీస లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్: కథలాపూర్ మండలం కలిగోట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబారిపేట గ్రామానికి చెందిన శీలం శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ కలిగోట శివారులోని సత్యనారాయణస్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

కారు, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆదివారం కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. తక్కళ్లపెల్లికి చెందిన నారపాక అరుణ, మల్లవ్వ పనినిమిత్తం ఆటోలో జగిత్యాల వస్తున్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న అరుణ, మలవ్వకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

18 ఏళ్ల నిరీక్షణకు మోక్షం

- దుబాయ్ జైలు నుంచి విడుదలై ఇంటికి చేరిన మానాల వాసి
- కేటీఆర్ కడుపు సల్లగుండాలి: హనుమంతు భార్య పద్మ


పద్దెనిమిదేళ్ల అనంతరం భర్త హనుమంతుతో భార్య పద్మ, కూతురు గౌతమి

మల్యాల(చొప్పదండి): పెళ్లైన ఏడాదికే ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి.. అక్కడ హత్యకేసులో ఇరుక్కుని జైలుకెళ్లి 18 ఏళ్ల తర్వాత ఇంటికి చేరాడు జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతు. గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతుకు బుగ్గారం మండలం గోపులాపురానికి చెందిన పద్మతో 20ఏళ్ల క్రితం వివాహమైంది. పెళ్లైన ఏడాదికే ఉపాధి కోసం హనుమంతు దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పాప పుట్టిన తర్వాత పురుడు చేసిన మరునాడే దుబాయ్ వెళ్లాడు. మూడు నెలలకే హత్య కేసులో జైలుకెళ్లాడు. అప్పటి నుంచి ఆయన భార్య పద్మ భర్త కోసం ఎదురుచూస్తూనే ఉంది. ఆమె 18ఏళ్ల నిరీక్షణ ఫలించాయి. దుబాయ్ జైలు నుంచి విడుదలై ఇంటికి చేరిన భర్త హనుమంతును చూసి కడుపులో దాచుకున్న దుఃఖం కట్టలు తెంచుకుంది. 'మాది రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద వడ్డెర కుటుంబం. ఉపాధి కోసం ఆయన (హనుమంతు) దుబాయ్ పోయిండు. అక్కడ జైలులో పడ్డడు. పద్దెనిమిదేళ్లుగా భర్త కోసం ఎదురుచూసిన. నా ఐదుగురు అన్నలు, ఇద్దరు తమ్ముళ్ల సహకారంతో తల్లిగారింట్లో ఉంటూ.. బీడీలు చేస్తూ, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీసిన. మూడు, నాలుగు నెలలకు ఒకసారి భర్తతో ఫోన్‌లో మాట్లాడిన. భర్తను తలుచుకుని ఏడుస్తూ నిద్రలేని రాత్రులు గడిపిన. కూతురు గౌతమిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన. హనుమంతును ఇంటికి రప్పించేందుకు కేటీఆర్ సారును కలిసినం. కేటీఆర్ సారు కడుపు సల్లగుండ ఆయన చేసిన మేలుతో దుబాయ్ జైలు నుంచి నా భర్త బయటపడి ఇంటికి చేరిండు. ఆయన చేసిన మేలు జీవితకాలం మరిచిపోను..' అని తన భర్త జైలు నుండి విడుదల కోసం కృషి చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు హనుమంతు భార్య పద్మ కృతజ్ఞతలు తెలిపింది.

తరలివచ్చి.. మొక్కులు చెల్లించి





వేములవాడ: రాజన్న సన్నిధి రద్దీతో కిటకిటలాడింది. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆదివారం 40 వేల మంది రాజన్నను దర్శించుకున్నారు. దీంతో రూ.అరకోటి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 20న హుండీ లెక్కింపు గత రెండునెలలుగా అశేషంగా తరలివస్తున్న భక్తులతో రాజన్న హుండీలు నిండిపోతున్నాయి. ఇటీవలే హుండీలు లెక్కిస్తే గతంలో ఏనాడు లేనివిధంగా ఆదాయం రూ.రెండున్నర కోట్లు సమకూరింది. మళ్లీ హుండీలు నిండిపోవడంతో ఈనెల 20న హుండీ ఆదాయం లెక్కించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో జరిగే హుండీ లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఈవో కృష్ణప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.